


"డియర్ స్కాలర్స్....

ఈ యూనివర్శిటీకి, నాకూ ఉన్న అనుబంధం రెండు దశాబ్దాలనాటిది. అధ్యాపకుడిగా ప్రవేశించి ఆచార్యుడిగా పరిణతి చెందేనాటికి, మెదడు విషయ జ్ఞానంతో పదును పొందటానికీ ఈ వైడ్ గాప్ అవసరమైంది. సముద్రంలో చేప పిల్లలా ఈదులాడుకుపోయిన ఈ కాల విరుగుమునంలోనే ఎన్నో వేలమంది విద్యార్థులలో సన్నిహిత సంబంధం, మరి కొందరితో ఆత్మబంధం పెంపొందించుకొనే అవకాశం, అదృష్టం ఈ విశ్వ విద్యాలయం నాకు కల్పించింది. అందు కీనాడు ఒకవైపు అనంత మైన సంతృప్తి, మరోవైపు అదే క్వాంటిటీలో అసంతృప్తి చెరిసగమై నన్ను చలింప చేస్తున్నై. తర్కబద్ధంగా ఆలోచిస్తే ఈ అసంతృప్తి ముఖ్యంగా నా స్టీరియో టైప్డు ప్రొఫెషన్ వల్లనే. చట్రంలో బిగించబడ్డ సబ్జక్టు గొంతు తప్ప, ఈ సాంప్ర దాయానికి అతీతంగా, నా స్వంత గొంతును మీకు విన్పింప జేయాలన్న నా ఆరాటం నాలోనే ఉండిపోయింది. ఈ రెండు దశాబ్దాల నుండీ నేను బోధిస్తున్నదీ, మీరు రిసీవ్ చేసుకొంటు న్నది ఒకే కోణంనుండి

వెలికి వచ్చే అతిపాత అనుసరణ సిద్ధాంతం. నలిగి నలిగి జీర్ణదశకు చేరిన రొటీన్ విషయం.

అందుకే, మై డియర్ ఫ్రెండ్స్......గత కొన్ని రోజులుగా నాలో అంతర్వేదన అనేకముఖాలై నా మనసు పొరలన్నింటిని ఆక్రమించి నన్ను వేధిస్తున్నది. ఎన్నో ప్రశ్నలు నాలో ఉదయించి ప్రత్యుత్తరానికై ఎదురు చూసి చూసి సమాధానం అందక నాలోనేఅణగారిపోతున్నై. కొన్నింకా నిలవేసి నన్ను సవాల్ చేస్తూనే ఉన్నై.

ఈ విజ్ఞానమంతా మెటీరియలిస్టిక్‌గా, ఎపిక్ బైపులో మనిషికి భౌతికంగా అనేక సదుపాయాలు కల్పిస్తున్నదే తప్ప, ఆ మనిషి అంతర్ముఖుడై, సమిష్టి దృక్పథంతో ఈ సామాజిక వ్యవస్థాగత మిట్టపల్లాలను అవగాహన చేసుకొనే దానికి ఏవిధంగానూ తోడ్పడటంలేదని ఇప్పుడు గ్రహించ గలుగుతున్నాను. అందువల్లనే....ఇప్పుడు మిమ్మల్ని సమావేశపరిచిందానికి ప్రత్యేక ప్రాధాన్యతుంది. మీరంతా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి రిసెర్చి రంగంలో అడుగు పెట్టిన వాళ్ళు. విజ్ఞానంలో చివరి మెరుపుల్ని చూడ బోతున్న వాళ్ళు. అయితే, ఈ పరిశోధనలూ, ఈపట్టాలూ మీ మీ వ్యక్తిగత భవితవ్యానికి మెట్లుగా నిలుస్తున్నాయే తప్ప, అణగారిన మానవాళి నికృష్ట జీవితావస్థలకు భరతవాక్యం చెప్పే మార్గదర్శక విధానానికి, పరిష్కార ప్రమేయానికి ఏవిధంగానూ టార్జెట్ కాలేకపోతున్నై.

అందుకని . . .నే నో నిర్ణయాని కొచ్చాను. సెంచరీస్ నుండి వస్తున్న ఈ రొటీన్ మిడిల్ వాల్ విద్యనుమాని, సామాజిక వ్యవస్థా విభేదాలను వర్గ వైరుధ్య అనుపానాలనూ కూలంకషంగా పరిశీలించటానికి బయటి ప్రపంచంలోకి పోయిరండి. విశ్వవిద్యాలయం తరపున మీకు రెండు నెలలు సెలవు గ్రాంటు చేయిస్తున్నాను.
వివిధ వర్గమానవ జీవితా వస్థలను ప్రత్యక్షంగా స్టడీ చేసిరండి.

మానవ ప్రశాంత మనుగడకు శాంతి సుఖాలు మూల సంకేతాలుగా ప్రవచింపబడ్డై. అయితే సుఖమున్న చోట శాంతి చాయ ఉండదు. శాంతి ఉన్న చోట సుఖ స్వరూపము ఉండదు. ఇది నా వ్యక్తిగత థియరీ. ఈ సమాజంలో అన్నార్తులు, అశీర్తి రోగులు, కోట్లకు పడగలెత్తిన కుబేరులు, క్షణక్షణం అవయువాలను రాపిడి పడుతున్నా పొట్టగడవని నిర్భాగ్యులు — . . ., ఈ అంతరాలను, ఈ వైరుధ్యాలను, ఇందుకు గల మూల కారణాలను మీరు అన్వేషించండి. మా స్టడీ థీసిస్‌ను నేను పై అధికారులకు సబ్మిట్ చేస్తాను. మన విద్యా విధానానికి, ఏకొద్ది మందికో అది అందించే సుఖమయ జీవితానికీ ఇదే సరైన విరుగుడేమో. మీ థీసిస్‌ను యూనివర్శిటీ నుండి ప్రభుత్వానికి పంపే ఏర్పాటు కూడా నేను చేయిస్తాను. తత్ఫలితంగా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవచ్చు. అందువల్ల ఈ వర్గ అంతర రాక్షసిని కొంత వరకైనా దూరదూరంగా తరిమి వేయవచ్చు. రేపటి నుండే మీ పర్యటనా కార్యక్రమాన్ని ప్రారంభించండి. ఈ విషయంలో నాతోడ్పాటు మీ కెప్పుడూ ఉంటుంది. మీ ప్రయత్నం విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను."

* * *

ఏ అదృష్టహీనుని సుఖ స్వప్నమో ముక్కలు ముక్కలైందన్నట్లుగా ఆకాశంలో చెదిరిన మేఘ శకలాలు. అదే పనిగా అంటిపెట్టుకొన్న ఆశల పోగుల వలే అల్లుకు పోయిన చెట్లు, ఆ చెట్లపైన రాత్రి బ్రతుకు గడిపే పక్షులు ఆచెట్లే తమను చేతులెత్తి దీవిస్తున్నట్లు వాటి క్రింద జేరిన అధోగతి జీవులు. కలిగిన నాడు తిని, లేనినాడు కాళ్ళు బారజాపుకొని నిశ్చింతగా కాలం గడిపే బడుగు మానవులు. పైన పక్షులు., వాటి గూళ్ళు. క్రింద మనుషులు., అమనుషులు నివసించే గూళ్ళ వంటి గుడిసెలు. కొమ్మల మీద రెక్కలున్న పక్షులు., కొమ్మల క్రింద ఈ కృత్రిమ సమాజ వ్యవస్థలో ఆధరువు అందని రెక్కలు తెగిన మనుషులు. వేడిని వెన్నెలను సమ్యక్ దృష్టితో ఎదుర్కొనే మూగ జీవాలు. ప్రేలాడే శవాలు. జీవాత్మ కొరకు పోరాటమేగాని దివ్యాత్మ ప్రబోధాల పొడ తెలియని వాళ్ళు. వర్తమానపు మొదలేగాని, భవిష్యత్తు చివర చూపు కందని వాళ్ళు. చెట్టు ఆశ్రయ మిచ్చినంతగా అదృష్టం ఆశ్రయ మీయలేదు వాళ్ళకు.

చలి వేధించే కాలం. ఆకాశానికీ, భూమికీ గొడుగు పట్టిన సూర్య కిరణాలు నిర్వీర్యంతో వెల వెల బోతున్నై. సూర్యుని నాడుల్లో వేడిరక్తం చల్లారిందేమో! దూరంగా వినిపించే రైలు కూత. గుబురు గుబురుగా ఆక్రమించిన చెట్లు. ఆచెట్ల కింద అంతులేని సందడి. సుషుప్తి అవస్థ నుండి జాగృదావస్థకు వచ్చిన నరుల జీవయాత్ర కోసం పడే ఆరాటానికి సంకేతమే ఆసందడి. దరిద్రం మంచులా కురుస్తున్నది. కలవారి గడపల్నుంచి మెడ బట్టి నెట్టి వేయబడ్డ కష్టాలు, కన్నీళ్ళు ఇక్కడికి ఏకాఏకిని దిగుమతై మురుగు పట్టినై. ఆ మురుగుమీద కర్మ సిద్ధాంతం దోమ సంగీతం ఆలపిస్తున్నది. విధికి పిచ్చెత్తి పోయింది. మానవతా వాదానికి అంపశయ్య తయారై వుంది. పరమార్థాన్ని గంగి రెద్దులా అలంకరించి వాడవాడలా తిప్పుతూ నవ్వుతున్నాడు అదృష్టవంతుడైన నరుడు. మనిషి, మతం, మానవత్వం, పుణ్యం, పాపం, పాతివ్రత్యం ఇవన్నీ పురాణాల్లో కుళ్ళి పోతున్నాయి. ఈ చెట్ల కొమ్మలకే న్యాయ ధర్మాలు ఉరేసుకొన్నై. సహోదర భావం నగం కబళించబడి మృత్యువు నోట్లో ఉంది. ఈ అందమైన సృష్టి, అర్థవంతంగా మలచబడ్డ సృష్టి ఇక్కడ ముదివగ్గై నిరాశల్లో, నిట్టూర్పుల్లో మూలుగుతూంది. మానవ రక్తాన్ని స్వార్థం విరిచేస్తే, మేధను అహం చెద పురుగు తొలి చేసింది. దానికి సాక్ష్యం ఈ చెట్ల క్రింద జీరాడే విషాద చీకటి వ్యవస్థ.

"ఏదిరాఈ జనన మరణముః శివయోగి వినరా... నిజబోధ గనరా. . . విను లేది. . . కను లేది. . . మను లేదిరా." చచ్చేవాడు తులసి తీర్థం గుటకతో సంతృప్తి పడ్డట్లు తతగీతం పాడుతున్నాడు చెట్టు క్రింది బైరాగి.

"బాగున్నాదా అవ్వా?"

ఆ ముసల్ది అర్థంగానట్లు చూస్తుండి పోయింది. కొంచెం దూరంగా పిడతలోని గంజిని పిల్లలకు వంచుతూ ఉన్న మధ్య వయసు స్త్రీ నావంక అనుమానంగా, ఆశ్చర్యంగా చూడ సాగింది.

నీవూ రావమ్మా. . . మీ మంచి చెడ్డలు తెలిసి కోటానికే నేనొచ్చింది."

"మళ్ళీ ఎలచ్చన్లొత్తన్నాయా బాబు?"

నైరాశ్యంతో, చీత్కారంతో ఆ ముసల్ది అడిగిన ఆ ప్రశ్న వెనుక రగిలే ఆమె వేదన, బాధ, రోత నా కర్థమైంది. ఎన్నికల సంబరంలో పైపై పటాటోపంతో వీళ్ళని పరామర్శించటం, వాగ్దానాలతో పూరించడటం, దరిద్రాన్ని స్వార్థానికి ఎరవేసి కొనుక్కోటం. . . ఆతర్వాత. . . .,

"ఏటి పనిమీదొచ్చినావు బాబు? మందు లిచ్చే బాబువా నీవు?" ముసల్ది అనుమానం తీరక తిరిగి ప్రశ్నించింది.

"మీరంతా బాగున్నారా?"

"బాగం టే?"

"ఏ బాధా లేకుండా. . ."

"బాదలడటం, అవికాయిలు గాయటం మాకు కొత్తేటుంది. కొత్తగా అనుబ గిత్తన్నామా., పుట్టిన కాడి నుండి గిట్టిపోయే దాకా అయి మావెంట ఉండేవేగా."

చెబుతూ చెబుతూ నాలుకను బుగ్గల్లోకి సుడలు తిప్పి తుపుక్కున వూసింది ముసల్ది. నొసట్లు చిట్లించి పైన చెట్లనై పోవారు చూసి నిట్టూర్పు విడిచింది., జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి అట్ట కట్టిన చింపిరిని కొంత వదిలించుకొంది.

"ఇయ్యాల నా కొడుకు, అదిగోదాని మొగాడు దాన్ని సితక బాదినాడు. బుడ్డోళ్లకు గంజి మెతుకులు లేనప్పుడల్లా ఆడికి వచ్చేదల్లా ముందా కోపమే. అంతే. . ., రోజు గడునుద్ది., ఆడు మరిసి పోతాడు., ఇదీ మరిసిపోతది., అయినా బాబూ. . . పిల్లాడు ఆకలంటూ ఏడిస్తే కొడితే ఆకలి పోద్దా? పోతే పాపం పోవాలిగాని. . . ."

(ఇంకా వుంది)

'ఏది పాపం?', 'నా విత్రి'
నవలలతో ఆంధ్రపాఠక
లోకంలో అపూర్వ సంచలనం
సృష్టించిన
శ్రీ చివుకుల పురుషోత్తం
మరొక సంచలనాత్మక నవల
సంస్కారణ
ప్రచురణ త్వరలో ప్రారంభం